నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | వరంగల్, శనివారం 24 ఆగస్టు 2024 | MAHABUBABAD



ప్రజాభవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

## దళితబంధు నిధులు విడుదల చేయాలి

**ప్రజాభవన్ వద్ద ములుగు లబ్ధిదారుల నిరసన**

ములుగు రూరల్, ఆగస్టు 23 : దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద ములుగు జిల్లా లబ్ధిదారులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈమేరకు అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు ములుగు జిల్లాకేంద్రం నుంచి లబ్ధిదారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన లబ్ధిదారులందరికీ మొదటి విడత కేటాయించిన రూ.3లక్షలను తక్షణమే వారి అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకు కేటాయించిన నిధులను ఖాతాల్లో జమ చేయకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా సీఎం, డిప్యూటీ సీఎం తక్షణమే స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. కనీసం లబ్ధిదారులకు మంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం చాలా బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో సాధన సమితి ఉపాధ్యక్షుడు బోనగిరి శ్రీనివాస్, గౌరవ సలహాదారుడు దర్శనాల సంజీవ, సలహాదారు బాలకిరణ్, నాయకులు కార్తీక్, బుల్లబ్బాయి, వివిధ నియోజకవర్గాల లబ్ధిదారులు పాల్గొన్నారు.



**ఇంద్రధనస్సు విరిసింది**

ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. సప్తవర్ణ శోభితమై కనువిందు చేసింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కొన్ని రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండ అధికంగా ఉండగా, సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఆకాశంలో రంగురంగుల ఇంద్రధనస్సు దర్శనమిచ్చింది. ఈ దృశ్యం చూపరులను కట్టిపడేసింది. ప్రజలు ఆసక్తిగా తిలకించారు. -కాళేశ్వరం, ఆగస్టు 23

**రేవంత్ సర్కారు అందరికీ రుణమాఫీ చేయక రైతులను అరిగోస పెడుతున్న తీరు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఏ ఊరిలో చూసినా బ్యాంకుల వద్ద బారులు, సొసైటీలు, వ్యవసాయ కార్యాలయాల వద్ద నిరసనలు, నిలదీతలు, తోపులాటలు, ప్రభుత్వంపై రైతుల ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్న సమయంలో ఎమ్మెల్యేలెవరూ నియోజకవర్గ పర్యటనలకు వెళ్లేందుకు సాహసించడం లేదు. అంతటా రుణమాఫీ కాని బాధితులే ఎక్కువ ఉండటంతో జనంలోకి వెళ్లేందుకు జంకుతున్నట్లు తెలుస్తోంది. ఈ కాంగ్రెస్ సర్కారు వల్ల రైతులకు నష్టమే తప్ప లాభం లేదన్న అభిప్రాయం అంతటా వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో ఇప్పుడు గ్రామాలకు వెళ్తే ఎక్కడ నిలదీస్తారోనని భయం వారిని వెంటాడుతున్నది. క్షేత్రస్థాయిలో తమకు ప్రతికూల పరిస్థితులున్నట్లు మండల, గ్రామస్థాయి నాయకుల ద్వారా తెలుసుకొని కొంతకాలం పర్యటనలను వాయిదా వేసుకోవడమే మంచిదని భావించి కేవలం పెళ్లిళ్లు, శుభకార్యాలకే పరిమితమవుతున్నారు.**

*- వరంగల్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



## మాఫీ అలా.. జనంలోకి పోయేదెలా?

- రైతులు ఎక్కడ నిలదీస్తారోనని ఆందోళన
- గ్రామాల్లోకి వెళ్లలేని పరిస్థితి
- పర్యటనలు వాయిదా వేసుకుంటున్న ఎమ్మెల్యేలు
- పెళ్లిళ్లు, శుభకార్యాలకే పరిమితం

### అధికార పార్టీ ఎమ్మెల్యేలకు రుణమాఫీ దిగులు

పంట రుణాల మాఫీ అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ఇబ్బందులను తెచ్చిపెట్టింది. అందుకే నియోజకవర్గ పర్యటనలకు వెళ్లేందుకు విముఖత చూపుతున్నారు. ఏ ఊరికి వెళ్లినా సగం మందికి కూడా మాఫీ కాకపోవడంతో ఎక్కడ నిలదీస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎక్కడచూసినా రైతులు స్వచ్ఛందంగా వచ్చి బ్యాంకర్లను, వ్యవసాయ అధికారులను నిలదీస్తున్న సంఘటనలే కనిపిస్తున్నాయి. గ్రామాల్లో పరిస్థితులు సర్కారుకు పూర్తిగా ప్రతికూలంగా ఉన్నాయని, ఇప్పుడు ఎక్కడా పర్యటనలకు రావొద్దని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులు సూచిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాలకు వెళ్లి రైతులకు కనిపిస్తే తమను నిలదీస్తారని ఎమ్మెల్యేలు అధికార పర్యటనలను పూర్తిగా పక్కనబెట్టారు. రుణమాఫీ విషయంలో రైతులకు నష్టం జరగడంతో ఈ పరిస్థితి వచ్చిందని, ఎప్పటివరకు ఇది తొలగిపోతుందో అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆలోచిస్తున్నారు. రైతుల అభిప్రాయం ఎలా ఉందని ప్రతిరోజు తమ వద్దకు వస్తున్న ద్వితీయ శ్రేణి నేతలను అడిగి తెలుసుకుంటున్నారు. ఏ ఊరిలోనూ పావు వంతు మందికి రుణాలు మాఫీ కాలేదని, అంతటా ఇదే చర్చ జరుగుతున్నదని వారు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక గత యాసంగిలో సాగునీళ్లు రాలేదని, ఇప్పుడూ ఇంకా రావడం లేదని.. రుణమాఫీ పూర్తి కాలేదని వివరిస్తున్నారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తిస్థాయిలో చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై గ్రామాల్లో ఇంకా వ్యతిరేకత పెరుగుతుందని చెబుతున్నారు.

### రైతుల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ ప్రక్రియపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. నిబంధనల పేరుతో వ్యవసాయం చేసే వారిని రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తున్నదని అంటున్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ అని అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనల పేరుతో అన్యాయం చేసింది. ఫలితంగా ఎక్కువ మంది ఈ పథకానికి దూరమయ్యారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి రైతుకు రుణాలు మాఫీ చేసిందని, కాంగ్రెస్ సర్కారు మాత్రం పావు వంతు మందికే మాఫీ చేసిందని రైతులు చెబుతున్నారు. రేషన్‌కార్డును సాకుగా పెట్టి అర్హులకు అన్యాయం చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాఫీ కోసం వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినా ఎలాంటి పట్టింపు ఉండడం లేదని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మాఫీ పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని కోరుతున్నారు.

### ఇప్పుడు కాదు.. తర్వాత వస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం జూలై 18న పంట రుణాల మాఫీ ప్రక్రియ మొదలుపెట్టింది. మొదటి దశలో లక్ష రూపాయలలోపు రుణాలను మాఫీ చేసినట్లు చెప్పింది. అదే నెల 30న రెండో దశ, ఆగస్టు 15న మూడో దశ మాఫీ ప్రక్రియను మొదలుపెట్టినట్లు చెప్పింది. మూడో దశ మాఫీ అయ్యే వరకు వేచి చూసిన రైతులు ఆందోళన బాట పట్టారు. బ్యాంకులకు వెళ్లి విసిగిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహంతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. రుణాలు మాఫీ చేసే వరకు ఊరుకునేది లేదని తెగేసి చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అందరు రైతులకు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటికే మంజూరైన కొన్ని పనుల శంకుస్థాపనలకు ఎమ్మెల్యేలను రావాలని అధికారులు కోరినా ఇప్పుడు కాదని, కొన్ని రోజులు ఆగాలని వాయిదా వేస్తున్నారు. అధికారిక కార్యక్రమాలను పూర్తిగా పక్కనబెట్టారు. శ్రావణ మాసం కావడంతో పెండ్లిళ్లు, ఇతర శుభాకార్యాలకు హాజరవుతున్నారు. అక్కడే సొంత పార్టీ క్యాడర్‌ను కలిసి మాట్లాడుతున్నారు. కలెక్టరేట్‌లో సమావేశాలకు హాజరవుతున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో నియోజకవర్గ కేంద్రాల్లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుల్లో అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.



వాజేడులోని ఏపీజీవీబీ ఎదుట పడిగాపులు గాస్తున్న రైతులు

## రుణమాఫీ కోసం తిప్పలు

**వాజేడు ఏపీజీవీబీ వద్ద రైతుల పడిగాపులు**

వాజేడు, ఆగస్టు23: రుణమాఫీ కోసం రైతులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వాజేడులోని ఏపీజీవీబీకి శుక్రవారం పెద్ద ఎత్తున అన్నదాతలు రావడంతో బ్యాంకు అధికారులు గేట్లు మూసివేసి క్యూలో విడుతల వారీగా లోపలికి అనుమతించడంతో ఇబ్బందులు పడ్డారు. ప్రతి రోజూ రుణమాఫీకి సంబంధించి ఆర్‌వోఆర్1బీ పత్రాలు, పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్‌లు ఇచ్చి వెళ్తున్నారు. మళ్లీ వారానికి ఖాతాలో నగదు జమయ్యిందా లేదా అని చెక్ చేసుకోవడానికి నాలుగైదు సార్లు బ్యాంకుకు రావాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక బ్యాంకుకు రోజూ వచ్చి వెళ్లడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉంటే రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని అధికారులు స్పందించి రైతులకు త్వరగా రుణమాఫీ చేయాలని స్థానికులు, వాహనదారులు సైతం కోరుతున్నారు.

### పైసలలో మోకాని ప్రాణం పోతుండె



నర్సింహులపేట, ఆగస్టు 23: బ్యాంకులో తీసుకున్న లోన్ మాఫీ అయిందని బ్యాంకుకు నా కొడుకుతో పొద్దున వచ్చిన. ఇక్కడ శానామంది ఉన్నరని లైన్ల నిల్సున్న. బ్యాంకోళ్లు అచ్చి తలుపు(షటర్) తీయంగనే అందరు ఒకల మీద ఒకలు పడ్డట్టు ఉరికిన్రు. గప్పుడు నా నెత్తి ఇసుప కడ్డీకి(గ్రిల్)కు తాకింది. రక్తం కారుతున్నా ఎవరూ పట్టించుకోలే. ఏం చేయాల్నో తెల్వలే. పైసలు సంగతేందో కాని కొద్దిగైతే నా పాణం పోతుండె.

*- మంద సోమక్క, రైతు, రామన్నగూడెం*



రోజుకు 30మందికే రుణమాఫీ చేస్తామని టోకెన్లు ఇస్తుండడంతో శుక్రవారం నర్సింహులపేట ఎస్‌బీఐలో రైతులు బారి తీరి, జరిగిన తోపులాటలో రామన్నగూడెం గ్రామానికి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలు సోమక్క గాయపడింది.

### రైతులకు తక్షణమే రుణమాఫీ చేయాలి



సంగెం : కాపులకనపర్తి సొసైటీలో పంట రుణాలు తీసుకున్న 1907 మంది రైతులకు తక్షణమే రుణాలను మాఫీ చేయాలి. అధికార పార్టీ నాయకులు వెంటనే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకపోవాలి. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలి. లేని పక్షంలో 13 గ్రామాల రైతులను కలుపుకొని అదే సొసైటీ ఎదుట పెద్దఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతాం. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తాం.

*- దొనికెల శ్రీనివాస్, గవిచర్ల రైతు*

## కాపులకనపర్తి రైతుల్లో కలవరం !

- రుణం పొందిన రైతులు 1,907 మంది
- మూడు విడుతల్లోనూ ఒకరికీ వర్తించని రుణమాఫీ
- అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక సమస్య కారణం
- అర్హత ఉన్నా వర్తించకపోవడంతో రైతుల నిరసన
- అధికారుల తీరుపై మండిపాటు.. ఆందోళన బాటలో రైతులు





వరంగల్, ఆగస్టు 23 (నమస్తేతెలంగాణ): అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ఒకరిద్దరు కాదు.. ఏకంగా 1,907 మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. అర్హత ఉన్నా తమకు రుణమాఫీ వర్తించకపోవడంతో కుమిలిపోతున్నారు. అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. వరంగల్ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) పరిధిలోని గ్రామాల రైతులు కాపులకనపర్తి పీఏసీఎస్‌లో సభ్యత్వం పొందారు. 3,200మందికి పైగా సభ్యులుండగా, 1,907 మంది రైతులకు సుమారు రూ.14.77 కోట్లకుపైగా రుణ పంపిణీ జరిగింది. వీరంతా రుణమాఫీ అమలుకు ప్రభుత్వం ప్రకటించిన 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ లోపు రుణాలు తీసుకున్న రైతులే. అయితే, రుణమాఫీకి అర్హత గల రైతుల జాబితాలను పంపాలని ఇటీవల ప్రభుత్వం అధికారులను ఆదేశించినా, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. మొదటి విడత రూ.లక్షలోపు రుణం గల రైతులకు గత జూలై 18 నుంచి ప్రభుత్వం నిధులను విడుదల చేయడం ప్రారంభించింది. కాపులకనపర్తి పీఏసీఎస్ అధికారులు వివిధ కారణాలతో జూలై 20 తర్వాత రుణమాఫీకి అర్హత గల 1,907 మంది రైతుల పేర్లతో జాబితాను ప్రభుత్వానికి పంపారు. సాంకేతిక లోపాల వల్ల ప్రభుత్వం ఈ జాబితాను రుణమాఫీ కోసం పరిగణలోకి తీసుకోలేదు. దీంతో అప్పటికే మొదటి విడుత రుణమాఫీ వర్తించని రైతులకు రెండో విడుత రూ.1.50 లక్షల రుణమాఫీ కూడా వర్తించలేదు. ఈ నెల 15న ప్రారంభమైన మూడో విడుత రూ.2 లక్షల రుణమాఫీలోనూ ఎవరి ఖాతాలో నిధులు జమ కాలేదు. ఇలా మూడు విడుతల్లోనూ 1,907మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు.

**ఆందోళనకు కార్యాచరణ**

రాష్ట్రంలో ప్రస్తుతం రుణమాఫీ ఒక రైతుకు కూడా వర్తించని పీఏసీఎస్‌ల్లో కాపులకనపర్తి ఒకటిగా నిలిచింది. మూడు విడుతల్లోనూ ప్రభుత్వం రుణమాఫీ చేసిన సమయంలో అర్హత గల 1,907 మంది రైతుల్లో పలువురు కాపులకనపర్తిలోని పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకొని అధికారులను కలిశారు. ఆడిట్, సాంకేతిక సమస్య వల్ల రుణమాఫీ వర్తించడంలో కొంత ఆలస్యమైందని, త్వరలోనే 1,907 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ అవుతాయని అధికారులు చెప్పారు. అయితే మూడో విడుతలోనూ రుణమాఫీ వర్తించకపోవడంతో ఈ 1,907మంది రైతుల్లో కలవరం మొదలైంది. వీరిలో చాలామంది రైతులు అధికారులను సంప్రదించారు. ప్రధానంగా ప్యాక్స్ అధికారులను నిలదీశారు. అర్హత ఉన్నా తమకు రుణమాఫీ వర్తించకపోవడానికి మీరే కారణమని మండిపడ్డారు. ఆ తర్వాత వ్యవసాయశాఖ అధికారులను కలిసి ఆందోళనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 20న గవిచర్ల వద్ద రాస్తారోకో నిర్వహించి తమకు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కాపులకనపర్తి పీఏసీఎస్ చైర్మన్, అధికారులు హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్ రావును కలిసి సాంకేతిక సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అర్హత ఉన్నందున 1,907 మంది రైతులకు రుణ మాఫీ వర్తింపజేయాలని కోరారు. ఇదిలాఉంటే మూడు విడుతల్లో తమకు రుణమాఫీ వర్తించనందున రానున్న రోజుల్లో రుణమాఫీ తమకు వర్తించేనా? అనే ఆందోళన 1,907 మంది రైతుల్లో నెలకొన్నది. అధికారుల తీరును నిరసిస్తూ దశలవారీ ఆందోళనకు కార్యాచరణ రూపొందించే పనిలో బాధిత రైతులు నిమగ్నమయ్యారు.

### రాజీనామాలు చేస్తాం..



సంగెం : రుణమాఫీ కాకపోతే పాలకమండలి మూకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు వెనుకాడదు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 40శాతం వరకు పంట రుణాలుమాఫీ అయ్యాయి. ఇప్పుడెందుకు కావు. రాష్ట్ర ప్రభుత్వం రుణాలను మాఫీ చేయలేకనే సాంకేతిక లోపమని కారణాలు చూపుతున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు. ఐక్యతతో ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండాలని రైతులను కోరుతున్నా.

*- సొసైటీ వైస్ చైర్మన్ ముడిదె శ్రీనివాస్*

### జూడాల సమ్మె విరమణ

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 23: కోల్‌కతా జీఆర్‌కార్ హాస్పిటల్‌లో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటనపై పది రోజులుగా దేశవ్యాప్తంగా విధులు బహిష్కరించి ఆందోళన చేసిన జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించినట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ కేసుపై పారదర్శకంగా విచారణ చేపడుతున్నామని, దేశవ్యాప్తంగా అన్ని హాస్పిటళ్లు, మెడికల్ కళాశాలల్లో వైద్యుల భద్రతా చర్యలను మెరుగుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు సూచించింది. వైద్య విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించడాన్ని స్వాగతిస్తూ ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా సమ్మె విరమించినట్లు చేసిన తీర్మానాన్ని అనుసరించి శనివారం నుంచి జూనియర్ డాక్టర్లు పూర్తిస్థాయి వైద్యసేవల్లో పాల్గొంటారని కేఎంసీ విభాగం జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

## కవి యోధుడు దాశరథి..



చిన్నగూడూరులో ఏర్పాటు చేసిన దాశరథి విగ్రహం, (ఇన్‌సెట్) రంగాచార్యులు(ఫైల్)

- నిజాం నిరంకుశత్వం నుంచి తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన ధీశాలి
- సాహితీవేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు
- చిన్నగూడూరులో నేడు రంగాచార్యుల జయంతి
- హాజరుకానున్న ప్రముఖులు

చిన్నగూడూరు, ఆగస్టు 23 : వెట్టిచాకిరి, నిరంకుశత్వం, అణచివేతలతో అంధకారంలో మగ్గుతున్న నాటి తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన కవి యోధుడు దాశరథి రంగాచార్యులు. నిజాం రాచరికపు ఆకృత్యాలపై ధిక్కారపు పోరుబావుటా ఎగరేసిన ధీశాలి. నేడు ఆ మహనీయుడి జయంతిని ఆయన స్వగ్రామం చిన్నగూడూరులో ఘనంగా నిర్వహించేందుకు స్థానికులు ఏర్పాట్లు చేశారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో వెంకటాచార్యులు-వెంకటమ్మ దంపతులకు 24 ఆగస్టు 1928లో రంగాచార్యులు జన్మించారు. బాల్యం నుంచే ఉద్యమ భావజాలాన్ని కలిగి ఉన్న రంగాచార్యులు నాటి రాజకీయ, సాంఘిక వ్యవస్థల్లో మార్పు కోసం, పెత్తందార్ల దోపిడీ నుంచి ప్రజలను విముక్తుల్ని చేసేందుకు ఉద్యమబాట పట్టారు. పదునైన రచనలతో ప్రజలను జాగృతం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తనదైన ముద్ర వేసుకున్నారు. రంగాచార్యుల ఉద్యమ పోకడలను గమనించిన భూస్వాములు, నిజాం పాలకులు తమ ఉనికికే ముప్పువాటిల్లే ప్రమాదముందని ముందే గ్రహించి చెరసాలలో బంధించారు. అయినా పోరుబాటను వదిలిపెట్టలేదు. అక్కడి నుంచి తప్పించుకొని అజ్ఞాతంలో ఉంటూ ఉద్యమాన్ని నడిపించారు. 'చిల్లరదేవుళ్లు, మోదుగుపూలు, జీవనయానం, జనపదం' వంటి ఎన్నో అద్భుత రచనలు చేసి ఎన్నెన్నో అవార్డులు, పురస్కారాలు అందుకొని తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. వేదాలను తెలుగులోకి అనువదించి సాహిత్య చరిత్రలో అగ్రస్థానంలో నిలిచారు.

**దాశరథి జయంతికి ఏర్పాట్లు**

సాయుధ పోరాటమే ఊపిరిగా, సాహిత్యమే తన ఆస్తిగా భావించి దొరలు, భూస్వాముల ఆగడాలను ఎదురించి, వెట్టిచాకిరి నుంచి ప్రజలను విముక్తులను చేసేందుకు అవిశ్రాంత పోరాటం చేసిన దాశరథి రంగాచార్యుల జయంతిని శనివారం ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. దాశరథి సోదరుల విగ్రహాలు వారి స్వగ్రామం చిన్నగూడూరులోనే మొదట గ్రామస్తులు ఏర్పాటు చేసుకొని ఏటా వర్ధంతి, జయంతిని నిర్వహిస్తున్నారు. రంగాచార్యులు, కృష్ణమాచార్యుల విగ్రహాలను హైదరాబాద్‌లోని టాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడంతోపాటు మండల కేంద్రానికి దాశరథి సోదరుల పేరు పెట్టి సముచిత స్థానం కల్పించాలని ప్రాంత వాసులు కోరుతున్నారు. రంగాచార్యుల స్వగ్రామంలో జరిగే జయంతి వేడుకలకు ప్రజాప్రతినిధులు, కవులు, కళాకారులు, ప్రముఖులు హాజరు కానున్నట్లు స్థానికులు తెలిపారు.

## నేను డాక్టర్‌ని.. ట్రీట్‌మెంట్ చేస్తా !

- ములుగు ప్రభుత్వ దవాఖానలో యువకుడి హల్‌చల్
- పిల్లల వార్డులోకి వెళ్లి పరీక్ష చేసే యత్నం
- నిలదీసిన బాలింతతో దురుసు ప్రవర్తన



సెక్యూరిటీ గార్డుతో గొడవ పడుతున్న మాస్కు పెట్టుకొని ఉన్న వ్యక్తి

ములుగు, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ) : రెడ్ టీషర్ట్, కళ్లజోడు, ముఖానికి మాస్క్ ధరించిన ఓ యువకుడు నేరుగా పిల్లల వార్డులోకి ప్రవేశించాడు. నేను డాక్టర్‌ని..! బ్రీతింగ్ ఎలా ఉందంటూ చిన్నారుల ఛాతీపై చేతులతో నొక్కే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చి నిలదీసిన బాలింతలు, సెక్యూరిటీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి హల్‌చల్ చేశాడు. రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేయడంలో అక్కడి నుంచి మెల్లిగా జారుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం ములుగు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో జరుగగా సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై దవాఖాన సూపరింటెండెంట్ జగదీశ్వర్‌ను వివరణ కోరగా గుర్తుతెలియని యువకుడు మద్యం మత్తులో దవాఖానలోని పిల్లల వార్డుకు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. సిబ్బంది పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. కాగా అతడి పేరు భరత్ అని, ములుగులో ఓ బేకరీలో పని చేస్తాడని విచారణ తేలినట్లు ఎస్సై తెలిపారు. మద్యం మత్తులో ఉండడంతో సాయంత్రం వరకు పీఎస్‌లో ఉంచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపామని చెప్పారు.

## ఎంజీఎం క్యాజువాలిటీకి స్ట్రెచర్లు కరువు

**ఇబ్బందులు పడుతున్న సిబ్బంది**

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 23: ఎంజీఎం అత్యవసర విభాగం(క్యాజువాలిటీ)కి స్ట్రెచర్లు, చక్రాల కుర్చీలు కరువయ్యాయి. దీంతో సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం క్షతగాత్రులను, రోగులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచడం కోసం ఏఎంసీ విభాగానికి తరలిస్తుంటారు. అక్కడ తగినన్ని పడకలు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర విభాగం నుంచి తరలించిన స్ట్రెచర్స్, వీల్‌చైర్స్‌ల్లోనే ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో క్యాజువాలిటీ అవసరాలకు తగినన్ని లేకపోవడంతో క్షతగాత్రులు, రోగులను తరలించడానికి అటెండెంట్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



స్ట్రెచర్లు అందుబాటులో లేకపోవడంతో పేషెంట్‌ను చేతుల మీద తీసుకువెళ్తున్న అటెండెంట్లు